


బేకరీలో అగ్ని ప్రమాదం

నరసరావుపేట టౌన్: షార్ట్ సర్క్యూట్ కారణంగా సాయి అనుష్క బెంగళూరు అయ్యంగారి బేకరీలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. రూ.5 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లింది.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 512.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఫిరంగిపురం: నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు.

సాయం అందదు..సాగు సాగేదెలా..

కూటమి ఏడాది పాలనపై అన్నదాతల ఆగ్రహం

- పెట్టుబడి సాయం అందించని కూటమి సర్కార్
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మే నెలలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ
- నేటి వరకు పంట రుణాలను మంజూరు చేయని ప్రభుత్వం
- జగన్ హయాంలో జిల్లాలోని రైతులకు రూ.3844.26 కోట్లు అందజేత
- కూటమి సర్కార్‌పై ఆగ్రహంతో రగిలిపోతున్న అన్నదాతలు
- పథకం అమలుపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- గతంలో ఒక్క రైతు భరోసా పథకానికే రూ.3515 కోట్లు ఖర్చు
- గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతులు

భూమినే నమ్ముకున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. మేము అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తాం..ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తాం...గిట్టుబాటు ధర కల్పిస్తాం అంటూ ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన కూటమి నేతలు అధికారం చేపట్టాక రైతుల గురించి పట్టించుకోవడం మానేశారు. పెట్టుబడి సాయం అందక..పంట గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేవారు లేక రైతులు అల్లాడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసేది. రైతుల కళ్లలో ఆనందం నింపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి సాయం లేదు. ఎప్పుడిస్తారో తెలియదు. ప్రభుత్వ తీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్


బాపట్లటౌన్: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే జిల్లాను పలకరించాయి. జిల్లాలోని రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దుక్కులు దున్నుకోవడం, ఎరువులు తోలే పనిలో నిమగ్నమయ్యారు. పంటల సాగు పెట్టుబడి సాయం కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా మార్పు చేసిందే తప్ప...దానిని అమలుచేసే దిశగా అడుగులు వేయలేదు. దీంతో వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో అన్నదాతలు సాయం కోసం ఆశగా ప్రభుత్వం వైపు చూస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పొలాలను దుక్కిదున్ని సాగుకు సిద్ధం చేసుకుంటుండగా మెట్టప్రాంతాల్లోని రైతులు పత్తి, మిరప, వేరుశెనగ, శెనగ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. దీనికి తోడు గడిచిన ఐదేళ్లల్లో బంగారం తనఖా పెట్టి బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకున్న రైతులు వడ్డీ చెల్లిస్తే రెన్యువల్ చేసేవారు. ఈ ఏడాది అసలు, వడ్డీ మొత్తం చెల్లించాల్సిందేనని బ్యాంకర్లు పట్టుపట్టడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు అధిక వడ్డీలకు వడ్డీ వ్యాపారుల వద్ద నగదు తీసుకొచ్చి బ్యాంకులో అప్పులు చెల్లించారు.



వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిందిలా...

రైతుల అభ్యున్నతి కోసం వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం ద్వారా ఏడాదికి ఒక్కొక్క రైతుకు రూ.13,500 చొప్పున ఐదేళ్లల్లో రూ.67,500 అందించారు. ఈ విధంగా ప్రకటించిన నగదును రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే మాసానికి ముందుగా మే నెలలో రూ.7,500, ఖరీఫ్ కోతలు, రబీలో సాగుచేసే రైతులకు అవరాల కొనుగోలు నిమిత్తం ఉపయోగపడే విధంగా అక్టోబర్‌లో రూ.4 వేలు, రైతుల పండుగగా పేరుగాంచిన సంక్రాంతి పండుగను రైతులు కుటుంబసమేతంగా జరుపుకునేందుకు వీలుగా జనవరి నెలలో రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.13,500 చొప్పున అందజేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా రైతులు నివాసం ఉండే గ్రామాల్లో ఒక్కొక్క గ్రామానికి రూ.21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించారు. జిల్లాలో రూ.32.26 కోట్లతో 148 రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు సహాయకులను నియమించి వారి ద్వారా రైతులు సాగుచేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయటం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను వెంటనే ఆదుకోవడం, ఇన్‌పుట్ సబ్సిడీ, యాంత్రీకరణ పరికరాల పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది జగనన్న ప్రభుత్వం.



ఐదేళ్లల్లో రూ.3844.26 కోట్లు అందజేత

జగనన్న ప్రభుత్వంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించడం, పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేశారు. రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ లాంటి పథకాలతో ఏకంగా గడిచిన ఐదేళ్లల్లో 3844.26 కోట్లను అందజేశారు. వాటిల్లో యంత్ర సేవా పథకం ద్వారా 402 సీహెచ్‌సీఎస్ గ్రూపులకుగానూ 266 యంత్రాలను రూ.12.38 కోట్లతో పంపిణీ చేశారు. సున్నావడ్డీ పథకం రూపంలో 1,26,869 మంది రైతులకుగానూ రూ.24.90 కోట్లు పంపిణీ చేశారు.

ఇన్‌పుట్ సబ్సిడీ...

నియోజకవర్గం	నష్టపోయిన రైతులు	దెబ్బతిన్న పొలాలు (హెక్టార్లలో)	నగదు (కోట్లలో)
అద్దంకి	5289	3483	రూ.4.38
బాపట్ల	17795	12445	రూ.20.57
చీరాల	23	15	రూ. 0.2
పర్చూరు	11855	10147	రూ.12.24
రేపల్లె	44135	24554	రూ.40.27
వేమూరు	35522	24676	రూ.40.09
మొత్తం	114619	75319	రూ.117.56

రైతు భరోసా....

నియోజకవర్గం	రైతులు	నగదు పంపిణీ(కోట్లల్లో)
అద్దంకి	47119	రూ. 871.93
చీరాల	6535	రూ. 121.20
పర్చూరు	43610	రూ.816.13
బాపట్ల	21947	రూ.399.58
వేమూరు	38025	రూ.681.44
రేపల్లె	34801	రూ.624.95
మొత్తం	192037	రూ.3515.24

పంటల బీమా

నియోజకవర్గం	రైతులు	నగదు చెల్లింపు(కోట్లు)
అద్దంకి	12,400	రూ. 57.03
చీరాల	297	రూ. 0.26
పర్చూరు	12,719	రూ.29.49
బాపట్ల	14,702	రూ.16.40
వేమూరు	29,027	రూ.38.58
రేపల్లె	22,975	రూ.32.38
మొత్తం	92,119	రూ.174.18

ఎప్పుడిస్తారో....ఏమో



గతంలో వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందే మే నెలలోనే రైతు భరోసా నగదు మా అకౌంట్‌లో జమఅయ్యేది. ప్రస్తుతం అసలు ఎప్పుడు ఇస్తారో..ఏమో తెలియకుండా ఉంది. ఎవరిని అడిగినా ఇంకా పైనుంచి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు.

–తాతా గుడారంకయ్య, రైతు, ముత్తాయపాలెం

హామీలను తక్షణమే అమలు చేయాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. పేద, మధ్యతరగతి రైతులు కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మారు. నమ్మి ఓట్లు వేసిన రైతులను ఇబ్బందులు గురిచేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. రైతుల అవసరాల దృష్టిలో పెట్టుకొని త్వరితగతిన అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఇస్తానని చెప్పిన రూ.20 వేలు అందజేస్తే బాగుంటుంది. అసలు ఈ పథకం ఎప్పటినుంచి ప్రారంభిస్తారు. ఎప్పుడెప్పుడు ఎంత చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తారో కూడా రైతులకు తెలియజేయాలి.

– గవిని కృష్ణమూర్తి, మాజీ చైర్మన్, మార్కెట్ యార్డు

ఆర్బీకేల ద్వారా ఎరువులు అందించేవారు



నాకు మా గ్రామంలో మూడెకరాల పొలం ఉంది. మరో 1.50 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటాను. గత ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏడాదీ రూ.13,500 చొప్పున నా అకౌంట్‌లో జమ చేసేది. ఎరువులు కూడా రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించేవారు. గతేడాది ఒక్క బస్తా కూడా అందించలేదు. గతంలో పొలాలు దెబ్బతింటే వెంటనే అధికారులు పొలాల్లో తిరిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా డబ్బులు అందించేవారు. గతేడాది వర్షాల వలన పంటలు మొత్తం నాశనమైనా ఒక్క రూపాయి కూడా సాయం అందలేదు.

–మోర్ల సముద్రాలు గౌడ్, నందిరాజుతోట, బాపట్ల మండలం

స్పష్టంగా చెప్పడం లేదు



నాకు న్యూ ముత్తాయపాలెం చానల్ ఆయకట్టులో రెండెకరాల పొలం ఉంది. మా ప్రాంతంలో సాగునీటి కాలువలు ఉన్నప్పటికీ సాగునీరు సకాలంలో అందవు. ఎత్తిపోతల పథకాల మీదనే ఆధారపడి వ్యవసాయం చేస్తుంటాం. గతంలో మే నెలలోనే రైతు భరోసా డబ్బులు అందించేవారు. వాటితో విత్తనాలు కొనుగోలు చేసుకొని, పొలాలు దుక్కులు దున్నించి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యేవాళ్లం. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూపాయి కూడా ఇవ్వలేదు. అసలు ఎప్పుడు వేస్తారో కూడా స్పష్టంగా చెప్పడం లేదు.

–గవిని సుందరయ్య, మద్దిబోయినవారిపాలెం, బాపట్ల మండలం

న్యూస్‌రీల్

అధిక కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలి

సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల



రేపల్లె: లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులతోపాటు న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పని చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల కోరారు. జులై 5వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారం కోసం శనివారం స్థానిక కోర్టు హాలులో డివిజన్ పరిధిలోని పోలీసులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం చేయాలన్న లక్ష్యంతో న్యాయశాఖ లోక్‌అదాలత్‌తోపాటు ప్రతి నెలా జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తోందన్నారు. డివిజన్ పరిధిలో పరిష్కారమయ్యే కేసులను గుర్తించి పరిష్కారం అయ్యేలా పనిచేయాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవీసాయి శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గీతా భార్గవి, ప్యానల్ న్యాయవాదులు కే.శ్రీవాణి, కుమార్‌బాబు, పారాలీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

దుకాణం బయట స్టాక్ బోర్డు తప్పనిసరి

జిల్లా అసిస్టెంట్ కంట్రోల్ లీగల్ మెట్రాలజీ అధికారి లిల్లీ



జే.పంగులూరు: నేటి నుంచి రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ చేయాలని.. దుకాణం బయట స్టాక్ బోర్డు తప్పనిసరిగా పెట్టాలని జిల్లా అసిస్టెంట్ కంట్రోల్ లీగల్ మెట్రాలజీ అధికారి పీ లిల్లీ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పంగులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె, తహసీల్దార్ సింగారావు ఈ పాస్ మిషన్లు తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ రేషన్ షాపుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీలు తప్పనిసరి పూర్తిచేసుకోవాలని తెలిపారు. మండల పరిధిలోని 21 గ్రామాలకుగాను 34 రేషన్ దుకాణాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి రేషన్ దుకాణాలలో ఈ పాస్ మిషన్లు పనిచేయాలన్నారు. ప్రతి ఒక్క డీలరు ఈ పాస్ మిషన్ స్కానర్, కీబోర్డు, టచ్ స్క్రీను, బ్యాటరీ తదితర పరికరాలు పని చేయాలని తెలిపారు. ఒకటో తేదీనే పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ పాస్ మిషన్‌లు పనిచేయక పోతే దానికి సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాక దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని తెలిపారు. రేషన్ షాపులు ప్రతి నెల 1వ తేది నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌లను ఆదేశించారు.

సబ్ జైలులో ఆహార పదార్థాల పరిశీలన



సత్తెనపల్లి: పట్టణంలోని సబ్ జైలును మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం సందర్శించారు. ముందుగా సబ్ జైలు పరిసరాలను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాలను, వాటి నాణ్యతను తెలుసుకున్నారు. ముడి సరకులను పరిశీలించారు. నిందితులు అందరికీ బెయిల్ మంజూరు అయ్యిందా, ఎన్ని రోజులుగా రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు, 70 సంవత్సరాలు వయస్సు ఉన్న వారు ఎవరైనా ఉన్నారా? వంటి విషయాలు ఆరా తీశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది బీఎల్. కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఫిరంగిపురం: మేరికపూడి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహం దెబ్బతినడంతో దానిని ఇటీవల తొలగించారు. నూతన విగ్రహాన్ని శనివారం ఉదయం 8.12 గంటలకు పునఃప్రతిష్ఠ చేశారు. ఉదయాన్నే మండపారాధన, పంచగవ్య పూజ చేశారు.

నయవంచకుడు చంద్రబాబు



వెన్నుపోటు దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున

- మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున
- 4న వెన్నుపోటు దినోత్సవం
- వెన్నుపోటు దినోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బాపట్లటౌన్: అన్నివర్గాల ప్రజలను నమ్మించి మోసం చేసిన నయవంచకుడు చంద్రబాబు అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పేద ప్రజలను నమ్మించి మోసం చేసిన చంద్రబాబు పరిపాలనకు నిరసనగా ఈ నెల 4న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం వెన్నుపోటు దినోత్సవ వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. నాగార్జున మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్-6 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించారని, ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా ఇచ్చిన హామిల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. పేదలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టకుండా రెడ్ బుక్ పాలనపైనే దృష్టిసారిస్తున్నారన్నారు. ఆడబిడ్డ నిధి కింద ఇంటిలో 18 నుంచి 59 ఏళ్ల మహిళలు ఎంతమంది ఉంటే అందరికి నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని మహిళలను మోసం చేశారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలందరికీ ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పి నిలువునా మోసం చేశారన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ బండలు అందజేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన చంద్రబాబు అరకొర బండలందించి అందరికీ అందజేసినట్లు గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలున్నా నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ ఊదరకొట్టిన కూటమి నేతలు పేద విద్యార్థుల తల్లులను నిలువునా మోసం చేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ చిరుద్యోగులను నిలువునా మోసం చేసి యానిమేటర్లు, ఆశావర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, వాచ్‌మెన్లు, తాజాగా రేషన్ సరఫరా ఎండీయూ వాహనాలు, ఆపరేటర్లను తొలగించి వారి పొట్టలు కొట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరి నక్కా వీరారెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గవిని కృష్ణమూర్తి, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షులు వడ్డిముక్కల డేవిడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, పార్టీ మండల అధ్యక్షులు మరుప్రోలు కొండలరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పిన్నిబోయిన ప్రసాద్, ఆర్‌టీఏ నియోజకవర్గ అధ్యక్షులు జోగి రాజా, జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు కటికల యెహోషువా తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలి

బాపట్ల: విపత్తు నిర్వహణపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలి, ఆ దిశగా పని చేయాలని కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. జిల్లా అధికారులతో శనివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు అధికంగా పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి సమాచారం అందిందన్నారు. పంట కాల్వలు, చప్టాలు, చెక్ డ్యాములు ఎలా ఉన్నాయో పరిశీలించాలన్నారు. కాల్వలు, చెరువు కట్టలు బలహీనంగా ఉన్న వాటిని గుర్తించి బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాలలోని మురికి కాల్వల్లో ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకకుండా ముందుగానే నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో గ్రామ స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీలను అధికారులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణపై అధికారుల ప్రణాళికలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో బాపట్ల, చీరాల ఆర్డీవోలు పి గ్లోరియా, చంద్రశేఖర్, ఉప కలెక్టర్ లవన్న, పర్యవేక్షకులు షేక్ షఫీ, తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధన వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

బాపట్ల: యోగ సాధన వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, అందరూ యోగ సాధన చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యాన శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా సాధన ద్వారా క్యాన్సర్, బీపీ, షుగర్, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, వెన్నుపూస సంబంధిత వ్యాధులను తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొగాకు ఉపయోగిస్తే వ్యాధులు వస్తాయి

బాపట్ల: పొగాకు ఉపయోగిస్తే ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంగా శనివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ పాన్, గుట్కా సేవించినా క్యాన్సర్‌కు గురవుతారని తెలిపారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అధికారులు, విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

5న బాలబాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల ఫుట్‌బాల్ జట్ల జిల్లా సెలక్షన్ ట్రయల్స్ ఈనెల 5న ఉదయం 9 గంటలకు సత్తెనపల్లి సుగాలీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్ ట్రయల్స్‌కు వచ్చే సబ్ జూనియర్స్ బాలబాలికలు 2012 జనవరి 1 నుంచి 2013 డిసెంబర్ 31 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. జూనియర్స్ విభాగంలో బాలబాలికలు 2010 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 31మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. సెలక్షన్ ట్రయల్స్‌కు వచ్చు క్రీడాకారులు వారి డేటాఫ్ బర్త్, ఆధార్ కార్డు ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్- 73969 67776 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముగిసిన జిమ్నాస్టిక్స్ శిక్షణ



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గత నెల రోజుల నుంచి జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరాలు ఉల్లాసంగా ముగిసాయని జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. శనివారం స్థానిక బీఆర్ స్టేడియంలో జరిగిన ముగింపు శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ శిక్షణ ప్రతి రోజూ కొనసాగించాలని, దీనికి తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని తెలిపారు. శిక్షణలో సుమారు 200 మంది చిన్నారులు క్రమశిక్షణతో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కోచ్ అఫ్రోజ్, కృష్ణ తేజ, ఎం.శ్రీనివాసరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జెడ్పీలో స్థాయీ సంఘాల భేటీ

- కోరం లేక వాయిదా పడిన రెండో స్థాయీ సంఘ సమావేశం
- సమావేశానికి గైర్హాజరైన జెడ్పీ వైస్ ఛైర్మన్ నర్సిరెడ్డి



స్థాయీ సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్న ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం జెడ్పీలో భేటీ అయ్యాయి. ఏడు స్థాయీ సంఘాలకు రెండవ స్థాయీ సంఘ సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. అదే విధంగా జెడ్పీ వైస్‌ఛైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన జరగాల్సిన 3వ స్థాయీ సంఘ సమావేశాన్ని ఆయన గైర్హాజరు కావడంతో దుగ్గి జెడ్పీటీసీ యలమంద అధ్యక్షతన నిర్వహించారు. 1, 4,7వ సమావేశాలకు అధ్యక్షతన వహించిన జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, సీజనల్ వ్యాధులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా, జల వనరులు, వ్యవసాయం, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. కాకుమానులోని బాలికల వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రహరీ నిర్మాణం దిశగా సంబంధిత శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు

ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు జెడ్పీటీసీలను ఆహ్వానించడం లేదని ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని పలువురు జెడ్పీటీసీలు సమావేశంలో ఆరోపించారు. అయితే ఇదే సమస్యపై గతంలో జరిగిన సమావేశాల్లోనూ జెడ్పీటీసీలు పదే, పదే ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ వివిధ శాఖల అధికారులు పెడచెవిన పెడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన హెనీ క్రిస్టినా ప్రొటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యం తగదని అధికారులకు సూచించారు. అదే విధంగా స్త్రీ-శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఆయా సమావేశాల్లో జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, డిప్యూటీ సీఈఓ సీహెచ్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతుల ధర్నాను జయప్రదం చేయండి

రైతు సంఘాల నాయకుల పిలుపు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

చిలకలూరిపేట: బర్లీ పొగాకు రైతుల సమస్యలపై ఈనెల 5న గుంటూరు జీపీఐ కంపెనీ ముందు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్, నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో బ్లాక్ బర్లీ పంటను సాగుచేయమని రైతులను ప్రోత్సహించిన జీపీఐ, ఇతర కంపెనీలు మొహం చాటేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే బాపట్ల జిల్లాలో పొగాకు వేసి అప్పుల పాలైన ఇద్దరు కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, మరొక రైతు ఆత్మహత్యాయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిదగ్గర అప్పుల వాళ్ల నిలదీయటాలు, అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోలేకపోవటం, పిల్లల చదువులకు ఫైనాన్స్ కంపెనీలను బతిమలాడుకోవడంతో రైతులకు సరిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ధర ఇవ్వక, త్వరగా పాసులివ్వక క్వాలిటీ పేరుతో మంచి పొగాకును కూడా పక్కన పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రైతులు ఆవేదన వర్ణనాతీతమని చెప్పారు. మే 24న ఆరుగురు మంత్రుల పంటల ధరల నిర్ణయాల కమిటీ మార్టూరు దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న పొగాకు కంపెనీలు మొదటి రకం రూ. 12వేలకు తగ్గకూడదని, రెండవ రకం రూ.ఐదువేలకు తగ్గకూడదని ఒప్పుకొని ఇప్పుడు మాట మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు తప్పక కొంటామని రైతుల చుట్టూ తిరిగి సాగుచేయించి నేడు పట్టించుకోని కంపెనీ యాజమాన్యాలను నిలదీయటానికి ఈ నెల ఐదో తేదీన గుంటూరు రింగ్ రోడ్‌లో విద్యానగర్ 3వ లైన్‌లో గల జీపీఐ కంపెనీ వద్ద జరిగే ధర్నాకు నల్ల బర్లీ, వైట్ బర్లీ, వర్జీనియా పొగాకు పంట సాగు చేసిన రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల పాల్గొన్నారు.

ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఎస్ నయీం భాను బాధ్యతల స్వీకారం



విజయపురిసౌత్: ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఎస్ నయీం భాను ఏపీఆర్ ఈఐ సొసైటీ కార్యదర్శి ఉత్తర్వుల మేరకు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే కళాశాలలో ఇప్పటి వరకు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వైఎస్ చౌదరి ఉద్యోగ విరమణ చేయటంతో నయీం భాను బాధ్యతలను స్వీకరించారు. ఆమె పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా డిగ్రీ కాలేజీకి 2013లో ప్రమోషన్ ద్వారా వచ్చారు. ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన నయీం భాను కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నయీం భాను అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి ఉత్తమ నాటిక 'అమ్మ చెక్కిన బొమ్మ'

ఉత్తమ హాస్యనాటిక 'మా ఇంట్లో మహాభారతం'



విజేతలకు బహుమతులు అందిస్తున్న పరిషత్ నిర్వాహకులు

నాదెండ్ల: మండలంలోని సాతులూరు ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయస్థాయి నాటిక పోటీల్లో మొదటి బహుమతి హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికకు లభించింది. కొలకలూరి శ్రీసాయి ఆర్ట్స్ 'జనరల్ బోగీలు' నాటికకు ద్వితీయ బహుమతి, తాడేపల్లి అరవింద ఆర్ట్స్ 'విడాకులు కావాలి' నాటికకు తృతీయ బహుమతి దక్కాయి. హాస్య విభాగంలో చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ 'మా ఇంట్లో మహాభారతం' నాటిక మొదటి స్థానంలో, ద్రోణాదుల సహృదయ ఆర్ట్స్ 'వర్క్ ఫ్రంహోమ్' నాటికకు ద్వితీయ స్థానం దక్కాయి. ఉత్తమ దర్శకుడిగా జి విజయ్ (జనరల్ బోగీలు), ఉత్తమ రచయితగా జ్యోతిరాజ్ భీశెట్టి (అమ్మ చెక్కిన బొమ్మ), ఉత్తమ నటుడిగా ఎం భానుప్రకాష్ (అమ్మ చెక్కిన బొమ్మ), ఉత్తమ నటిగా అనసూయ (అమ్మ చెక్కిన బొమ్మ) మొదటి బహుమతులు అందుకున్నారు. ద్వితీయ స్థానాల్లో ఉత్తమ నటుడిగా వరప్రసాద్ (అనశ్వరం), ఉత్తమ నటిగా వైకే భవాని (సారీ రాంగ్‌నంబర్) ద్వితీయ బహుమతులు అందుకున్నారు. ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా గంగోత్రి సాయి (విడాకులు కావాలి), ఉత్తమ క్యారెక్టర్ నటిగా సూర్య ప్రభావతి (జనరల్ బోగీలు), ఉత్తమ ప్రతినాయకుడిగా గోపరాజు విజయ్ (జనరల్ బోగీలు), ఉత్తమ హాస్యనటుడిగా పి పండు (మా ఇంట్లో మహాభారతం), ఉత్తమ హాస్యనటిగా గుడివాడ లహరి (వర్క్ ఫ్రం హోమ్), ఉత్తమ బాల నటిగా పి మహిత (ఎవరు), ఉత్తమ సంగీతం సురభి నాగరాజు (అనశ్వరం), ఉత్తమ ఆహార్యం దిలీప్ (కాశీ వాస రావయ్యా), ఉత్తమ అలంకరణగా కె థామస్ (విడాకులు కావాలి), జ్యూరీ-1,2,3గా అమ్మ చెక్కిన బొమ్మ, దొందూ దొందే, ఏకాకి ఎన్నికయ్యాయి. ఉత్తమ ప్రోత్సాహక ప్రదర్శనగా 'ఎవరు' నాటిక నిలిచింది. గత నెల 24-28 తేదీ వరకూ జరిగిన ఐదు రోజుల నాటికల ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతలుగా రామసత్యనారాయణ, బొర్రా నరసయ్య, కూచి రామాంజనేయులు వ్యవహరించారు. కళాపరిషత్ నిర్వాహకులు నడింపల్లి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, సభ్యుల చేతుల మీదుగా నగదు పారితోషికంతో పాటూ షీల్డ్ అందించారు.

విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు మృత్యువాత



జంగాలపల్లెలో మృత్యువాతకు గురైన గేదెలు

నాదెండ్ల: విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని జంగాలపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం గ్రామానికి చెందిన తాటిరెడ్డి అజంత, బాదినీడు పశికొండ, బుల్లాయి మూడు గేదెలను మేతకు వదిలివేశారు. రాత్రి ఇంటికి రాకపోవటంతో పశుపోషకులు వెతుకులాట ప్రారంభించారు. నుదురుపాడు రైల్వేస్టేషన్ సమీపంలోని క్వారీ వద్ద పొలాల్లో విద్యుత్‌తీగలకు తగిలి మృత్యువాతపడి కనిపించాయి. శుక్రవారం కురిసిన వర్షానికి స్తంభాలు ఒరిగి తీగలు కిందకు వేలాడుతుండటంతో గడ్డి మేసేందుకు వెళ్లిన గేదెలు విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాతపడ్డాయి. గేదెల విలువ రూ.4 లక్షలు ఉంటుందని, శనివారం ఉదయం సాతులూరు పశువైద్యాధికారి శ్రీలక్ష్మి పోస్టుమార్టం నిర్వహించారు. శుక్రవారం రాత్రి తూబాడు అడ్డరోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం విరిగిపడింది. విద్యుత్‌శాఖ అధికారులు విరిగిపడిన స్తంభాలను త్వరితగతిన గుర్తించి పునరుద్ధరించకుంటే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో సమస్యలు పరిష్కరించాలి

ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, ఎండీ ఖాలీద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ సీవీ రేణుక దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అన్ని కేడర్లలో తాత్కాలిక సీనియార్టీ జాబితాల్లో ఏర్పడిన ఇబ్బందులపై అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, తుది సీనియార్టీ జాబితాలను వెబ్ ఆప్షన్లకు ముందే విడుదల చేయాలని కోరారు. వెబ్ ఆప్షన్లు కౌన్సెలింగ్‌కు ముందుగానే తుది ఖాళీల జాబితాలను హెచ్‌ఆర్‌ఏ కేటగిరితో విడుదల చేయడంతో పాటు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టులకు కౌన్సెలింగ్ మాన్యువల్ విధానంలో జరపాలన్నారు. ఆయా ఖాళీల భర్తీ తరువాతే స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2014, 2012 తదితర డీఎస్సీల ద్వారా నియమితులైన ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియార్టీ జాబితాలను మెరిట్ కం రోస్టర్ ఆధారంగా తయారు చేయాలని, పుట్టిన తేదీ ఆధారంగా కాదన్నారు. తుది జాబితాలు విడుదలైన తరువాత సైతం గ్రీవెన్స్‌కు కనీసం ఒక్కరోజు అవకాశమివ్వాలన్నారు.

బదిలీల్లో ఉపాధ్యాయులకు తిప్పలు..

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రకటించిన ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను ముందుకు జరిపి, త్వరితగతిన పూర్తి చేయాలనే యత్నంలో హడావుడిగా తీసుకున్న నిర్ణయాలతో స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు హైస్కూళ్లలోని స్కూల్ అసిస్టెంట్లు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా బదిలీకి ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారని తెలిపారు. అయితే శనివారం సాయంత్రం వరకే అవకాశం ఇవ్వడంతో ఆన్‌లైన్‌లో నిర్ణీత ఫార్మేట్ లేకపోవడం, జాబితాలు సక్రమంగా డిస్‌ప్లే కాకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. బదిలీల్లో తరచూ ఇదేవిధంగా సాంకేతిక సమస్యలు ఎదురు కావడం, పరిష్కరించేందుకు విద్యాశాఖాధికారుల దగ్గరకు పరుగులు తీయడం వంటి సంఘటనలతో గందరగోళంగా మారిందన్నారు. సంబంధిత జాబితాలను సక్రమంగా ప్రదర్శింపచేసి, దరఖాస్తు చేసుకునేందుకు ఒక రోజు గడువు ఇవ్వాలని కోరారు.


రైల్వే స్టేషన్‌లో జూట్‌బ్యాగులు పంపిణీ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించిన డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

లక్ష్మీపురం: పర్యావరణాన్ని మరియు వ్యక్తి ఆరోగ్య ప్రమాదాలను కాపాడే మంచి జీవనశైలిని అనుసరించాలని గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ కోరారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో శనివారం జూన్ 6న జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు రకాల కార్యాక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రయాణికులకు అవగాహన కల్పించి జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ముందుగా రైల్వే స్టేషన్‌లో నుక్కడ్ నాటకం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి అవగాహన కల్పించారు. ప్లాట్‌ఫాం నంబర్ 1లో సుమారు 50 మంది ఉత్సాహభరితమైన విధంగా పిల్లలు ఫ్లాష్ మాబ్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఈనెల 22వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు కొనసాగేలా కార్యక్రమాలను రూపొందించడం జరిగిందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను నివారించాలని, క్లాత్ బ్యాగ్‌ల వంటి స్థిరమైన ప్రత్యామ్నాయాలను స్వీకరించాలని కోరారు. ఏడీఆర్‌ఎం సైమాన్, సీసీఎం డి.మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ జె.వి.అనూష, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, డీసీఎం కో-ఆర్డినేషన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ సీనియర్ డీఓఎం షాహబాజ్ హనూర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై లైంగికదాడికి యత్నం

అడిగేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులపై కారం చల్లి దాడి



తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు చిన్నారులతో ఉన్న ఓ మహిళపై స్థానికంగా నివాసముండే ఓ యువకుడు లైంగికదాడికి యత్నించాడు. ఆ మహిళ పెద్దగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సేకరించిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఓ ఆటోడ్రైవర్ తన భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటాడు. అతని ఇంటి ఎదురుగా శివ అనే వ్యక్తి నివాసముంటున్నాడు. శివ ఆటోడ్రైవర్ భార్యను తరచూ లైంగికంగా వేధించసాగాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం సమయంలో బాధితురాలు తన ఇద్దరు పిల్లలతో కలిసి తన ఇంట్లో నిద్రిస్తుండగా, శివ ఇంట్లోకి చొరబడి బాధితురాలిపై లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలు కేకలు వెయ్యడంతో నిందితుడు పరారయ్యాడు. ఘర్షణలో బాధిత మహిళకు పలుచోట్ల దుస్తులు చిరగడంతో పాటు, స్వల్ప గాయాలయ్యాయి. జరిగిన విషయాన్ని బాధితురాలు తన భర్తకు, బంధువులకు చెప్పడంతో అందరూ కలసి శివ ఇంటికి వెళ్లి అడగ్గా, శివ కుటుంబ సభ్యులు వీరిపై గొడవకు దిగి, బాధితురాలి కుటుంబ సభ్యులపై శివ కుటుంబ సభ్యులు కారం చల్లి దాడికి పాల్పడ్డారు. జరిగిన ఘటనపై తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా దాదాపుగా మూడు గంటల సేపు పోలీసులు తమను బయట నిలబెట్టారని బాధితురాలి బంధువులు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

35 బైకులు స్వాధీనం, తొమ్మిది మందిపై కేసు



నాదెండ్ల: కోడిపందేల స్థావరాలపై పోలీసులు శనివారం మెరుపుదాడి నిర్వహించారు. చందవరం, సాతులూరు మార్గంమధ్యలో పంటపొలాల్లో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి ఎస్సై జి పుల్లారావు దాడి చేశారు. ఒక పందెం కోడి, 35 బైకులు, తొమ్మిది మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కొందరు పందెంరాయుళ్లు కోళ్లతో పరారైనట్లు గుర్తించారు. వీరిని త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ గుంతలో మృతదేహం



నాదెండ్ల: గణపవరం-వేలూరు వెళ్లే డొంక రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న క్వారీగుంతలో మృతదేహం శనివారం కలకలం రేపింది. అటుగా వెళ్తున్న కొందరు తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటాయని, ఒంటిపై చొక్కా లేదని, బ్లూ రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుమారు రెండు రోజుల కిందట సంఘటన చోటుచేసుకుని ఉంటుందని, మృతుడు క్వారీ గుంతలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా, ఎవరైనా హత్య చేసి గుంతలో పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గృహంలో బంగారు ఆభరణాలు చోరీ

కొల్లూరు: తాళం వేసి ఉన్న గృహంలోకి అగంతకులు ప్రవేశించి బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంఘటన మండలంలోని దోనేపూడిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. దోనేపూడికి చెందిన జి.ప్రత్యూష శుక్రవారం మధ్యాహ్నం తన కుటుంబ సభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు బంధువుల ఇంటికి ఓ ఫంక్షన్‌కు వెళ్లింది. అదేరోజు రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చిన ఆమె ఇంటికి వేసి ఉన్న తాళం వేసి ఉండగానే, గడి పెట్టె కొక్కాన్ని తొలగించి ఉండటం గమనించి ఆందోళనకు గురయ్యారు. ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా ఇంటిలో ఉంచిన పిల్లలకు చెందిన రెండు బంగారపు ఉంగరాలతోపాటు, పెద్దలకు చెందిన మరో రెండు బంగారు ఉంగరాలు, ఓ బంగారు చైన్ చోరీకి గురైనట్లు గుర్తించారు. గృహంలో ఆభరణాల చోరీపై బాధితురాలు కొల్లూరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.